# అర్హత

"ఏయ్ మంజూ! నువ్వింకా లేవలేదూ! యిప్పుడు టైమ్ ఎంతో తెలుసా? తొందరగా లేచివెళ్ళి బ్రష్ చేసుకో! ఏవండోయ్! మిమ్మల్నే మీ స్నానానికి వేడి నీళ్ళు టవల్ బాత్ రూమ్‌లో పెట్టేను. త్వరగా వెళ్ళండి. లేకుంటే నీళ్ళు చల్లారిపోతాయి! మంజూ లేచిందో లేదో ఓ మారు చూసి మరీ వెళ్ళండి!" అంది యామిని కిచెన్‌లోంచి

భార్య హెచ్చరిక విని ఉలిక్కిపడ్డాడు అరవింద. చేతిలో పేపర్ టీపాయ్ మీద పడవేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళేడు. కూతుర్ని బలవంతంగా నిద్రలేపి వాష్‌బేసన్ వరకూ నడిపించుకవెళ్ళి-

"త్వరగా బ్రష్ చేసుకో నీ స్కూల్‌కి టైమ్ అవుతోంది!" అని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు అరవింద.

"మమ్మీ! నా బ్రష్ కనిపించటం లేదు!"అంది మంజు.

"రేక్‌లోనే వుంటుంది చూడమ్మా! నాకు యివతల పోపు మాడిపోతోంది!"

"చూసేను మమ్మీ! దొరకలేదు!" అంది మంజు బిగ్గరగా.

యామిని చేతిలోపని వదలివచ్చి చూసేసరికి కూతురు వాష్ బేసిన్ ప్రక్కగోడను అనుకొని కళ్ళుమూసుకొని నిల్చుని వుంది. కూతుర్ని ఆ పోజులో చూసిన యామినికి నవ్వాగలేదు. రేక్‌లోంచి బ్రష్ తీసి దానిమీద పేస్ట్ వేసి కూతురి బుగ్గతట్టి చేతిలో బ్రష్, టంగ్ క్లీనర్ వుంచింది.

"శుభ్రంగా బ్రష్ చేసుకొనిరా! నీకు హార్లిక్స్ కలుపుతున్నా" అని కిచెన్‌లోకి వెళ్ళింది.



అరవింద ఓ కంపెనీలో మేనేజర్‌గా జాబ్ చేస్తున్నాడు. యామిని సైన్స్ టీచర్. మంజుల ఏకైక కుమార్తె. మంజులకు వయసు ఆరు సంవత్సరాలు. రోజా కాన్వెంట్‌లో థర్డ్ క్లాస్ చదువుతోంది. ఎంతో తెలివైన పిల్ల. క్లాస్‌లో ఫస్ట్ ర్యాంకు వస్తోంది.

యామినికి ఉదయంపూట పని ఒత్తిడి చాల ఎక్కువ. రోజు ఉదయం నాలుగు గంటలకు లేచి కాఫీ, టిఫెన్స్, వంటా చేసి లంచ్ బాక్స్‌లు ముగ్గురివీ రడీ చేస్తుంది. ముగ్గరూ ఉదయం ఎనిమిది గంటలకు టిఫిన్ తిని యిల్లు వదిలి మరలా సాయంత్రం ఐదుగంటలకు వస్తారు. రాత్రి వంటపని ముగియగానే యామిని కూతురి చేత హోమ్‌వర్క్ చేయించి చదివిస్తుంది. మర్నాడు క్లాసులో చెప్పబోయే లెసన్స్ ముందుగానే చెప్పి కూతుర్ని ప్రిపేర్ చేసి పంపుతుంది.

అయితే మంజుల ఉదయంపూట ఎంతో బద్ధకంగా వుంటుంది. దాంతో తల్లిని బాగా విసిగిస్తుంది. ఆమెకు స్నానం చేసే వరకూ నిద్రమత్తు వదలదు. అన్నీ చేతికి అందివ్వాలి. తల్లి వెన్నంటి తరిమితే కాని ఏ పనీ చురుకుగా చేయదు.

యామినికి ఎంతో ఓర్పూ, నేర్పూ, సహనం వున్నాయి. ఆమెకు పని ఒత్తిడి

ఎంతవున్నా, కూతురు ఎంత విసిగించినా ఆమె సహనం ఎన్నడూ కోల్పోదు. కూతుర్ని కొట్టడం తిట్టడం, కసరడం వంట పనులు ఎన్నడూ చేయదు. ఆమెకు పిల్లల సైకాలజీ బాగా తెలుసు. ఆ వయస్సు వారిని కొట్టినా తిట్టినా ప్రయోజనం వుండదు. పైగా వారు ఎంతో మొండివారిగా తయారవుతారని ఆమె భావన. పిల్లలను సాధ్యమైనంత వరకూ మంచి మాటలతోనే వారికి ఏ పని చేయవచ్చో ఏ పని చేయకూడదో తెలియ చెప్పాలి.

అంతే కాదు పిల్లలు చేసే ప్రతి చిన్న మంచి పనిని మెచ్చుకోవాలి. దాంతో వారికి ఒక విధమైన సెల్ఫ్ కాన్ఫిడెన్స్ వచ్చి మంచి పనులే చేయాలనే కుతూహలం వారిలో పెరుగుతుంది. వారు చేసే పనులు తల్లిదండ్రులు, యితరులూ మెచ్చుకోవాలనే తాపత్రయం వారికి కల్గుతుంది.

యామిని అభిప్రాయానికి అద్దం పడుతుంది. రోజా కాన్వెంట్ స్కూల్, వూర్లో ఆ స్కూల్ బ్రాంచ్‌లు అరడజనువున్నాయి. క్రమశిక్షణకు ఎంతో విలువనిస్తారు. అందులోపని చేసే వారంతా ట్రైన్డ్ టీచర్స్ అవడం మరొక విశేషం.

ప్రతి క్లాస్‌లోనూ ఫస్ట్ ర్యాంక్ వచ్చిన స్టూడెంట్‌కువారు ఏటా పేరెంట్స్‌డే ఫంక్షన్‌లో బహుమతులిచ్చి ప్రోత్సహిస్తారు. అంతేకాక వారి ఆరు బ్రాంచ్ స్కూల్స్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన వారికి కూడ ప్రైజ్‌లు యిస్తున్నారు.

ఎల్.కె.జీ మొదలు యిప్పటి వరకూ మంజులకు ప్రతి యేడూ క్లాస్ ఫస్ట్ ర్యాంక్ బహుమతులు వస్తున్నాయి. మంజుల తల్లిదండ్రులకు అదెంతో గర్వకారణంగా వుంది. మంజులను టీచర్స్, స్టూడెంట్స్ఎంతో అభిమానంగా చూస్తారు.

రోజా కాన్వెంట్ స్కూల్లో యీ ఏడు సిటిజన్‌షిప్‌ట్రైనింగ్ అని ప్రతి క్లాసులోనూ ప్రవేశపెట్టేరు. అందులో కూడా ఫస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌కి ప్రైజులివ్వాలని నిశ్చయించారు.

పిల్లలకు గుడ్‌హేబిట్స్, చక్కటి క్రమశిక్షణ నేర్పాలని వారి సంకల్పం. అందులో భాగంగా పిల్లలు వేకువనే నిద్రలేచి ఎవరికి వారే తమ తమ పనులు స్వయంగా చేసుకోవడం నేర్పిస్తారు. ఉదయం బ్రష్ చేసుకోవడం, స్నానం చేయడం, నీట్‌గా డ్రస్ వేసుకోవడం. స్కూల్ బ్యాగ్‌లో అవసరమైన బుక్స్, పెన్సిల్, ఇరేజర్ వంటివన్నీ, ఇంకా లంచ్ బాక్స్, వాటర్ బాటిల్, నేప్‌కిన్ అవీ వున్నాయో లేదో స్కూల్‌కి

వెళ్లేముందూ, స్కూల్ నుండి యింటికి తిరిగి వచ్చే ముందూ చెక్ చేసుకోవడం స్కూల్‌కి రెగ్యులర్‌గా టైమ్ ప్రకారం రావడం, హోంవర్క్ కరెక్ట్‌గా చేసి చూపించడం, క్లాసులో పాఠాలు శ్రద్ధగా వినడం, అందరితోనూ స్నేహంగా వుండడం, పెద్దలతో గౌరవంగా మాట్లాడడం వంటివి నేర్పిస్తారు.

అంతేకాదు నీతి సూత్రాలను చిన్న చిన్న జానపద కథల ద్వారా బోధిస్తారు. "నాన్నా!-పులి!" "ఆవూ-పులి!" కథలు చెప్పి ఎప్పుడూ నిజమే చెప్పాలి. అబద్ధం ఆడరాదని. "నాలుగు ఎద్దులూ-సింహం" కథ చెప్పి ఐకమత్యమే బలం అని, "సింహం- చిట్టెలుక" కథ చెప్పి అందరితో స్నేహితంగా వుండాలని యిలా ఒక్కొక్క నీతికి కథలు చెప్పి బోధిస్తున్నారు.

ఆ విధంగా బాల్యంలో కథల ద్వారా నేర్పిన నీతులు వారి మనస్సులో బలంగా నాటుకొని అవి వారి జీవితాంతం గుర్తుంటుంది.

సంవత్సరం పొడుగునా పై విషయాలన్నీ నిశితంగా పరిశీలించి వారి మొత్తం ఆరు యూనిట్స్‌లో ఫస్ట్ వచ్చిన వారికి పేరెంట్స్ డే ఫంక్షన్‌లో ప్రైజ్ యివ్వాలని నిశ్చయించారు.

ఈ విషయం తెలుసుకున్న స్టూడెంట్స్‌లోను, వారి పేరెంట్స్‌లోనూ కాంపిటేషన్ పెరిగింది. ప్రతి వారూ యీ ప్రైజ్ తమ బిడ్డకే రావాలని పిల్లలకు యింటివద్ద ట్రైనింగ్ యివ్వడం మొదలుపెట్టేరు. దాంతో పిల్లలో చురుకుతనం, ఉత్సాహం, నీట్‌నెస్ వగైరా ద్విగుణీకృతమైంది.

అందరూ ఎదురుచూస్తున్న ఆ శుభదినం పేరెంట్స్ డే రానే వచ్చింది. రోజా కాన్వెంట్ మెయిన్ బ్రాంచ్ స్కూల్ ఆవరణలో ఫంక్షన్ ఏర్పాటు చేసారు. టీచర్స్, స్టూడెంట్స్. వారి పేరెంట్స్, పురప్రముఖులూ ఫంక్షన్‌కి వచ్చారు.

అరవింద, యామిని కూతురు మంజులను తీసికొని వచ్చారు.

వేదికమీద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్. ప్రిన్సిపాల్, ఆరు బ్రాంచ్‌ల హెడ్ మాస్టర్స్ వున్నారు.

పలువురి ప్రసంగాల అనంతరం ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం మొదలైంది. పిల్లలూ పెద్దలూ అందరూ ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న కార్యక్రమం అదే!

థర్డ్ క్లాస్‌లో ఫస్ట్ ర్యాంక్ ప్రైజ్, ఆరు యూనిట్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చి ఫస్ట్ ర్యాంక్ ప్రైజ్‌లు రెండు మంజులకే వచ్చాయి. మంజుల వేదిక మీదకు వెళ్లి రెండు ప్రైజులూ తీసుకొని వచ్చింది.

ఎమ్.డి. గారు మైక్ ముందుకు వచ్చి "పిల్లలలో మంచి ప్రవర్తన, గుడ్ హేబిట్స్ పెంపొందించాలని సిటిజన్‌షిప్ ట్రైనింగ్ మా విద్యా సంస్థలలో యీ యేడు నూతనంగా ప్రవేశపెట్టాము. గుడ్ హేబిట్స్‌లో టాప్ ర్యాంక్ సాధించిన స్టూడెంట్ 'మంజుల' థర్డ్‌క్లాస్ విద్యార్థిని" అన్నారు. మంజులకు ప్రైజ్ రావడం అందరూ హర్షించారు

మంజుల నెమ్మదిగా అడుగులు వేస్తూ వేదిక మీదకు వెళ్లి ఎమ్.డి. గారి ఎదుట నిల్చుంది. అయన ప్రైజ్ అందివ్వబోయారు. కాని మంజుల ప్రైజ్ అందుకోలేదు. ఏమో చెప్పబోయింది.

ఎమ్.డీ. గారు అందరినీ నిశ్శబ్దంగా వుండమని మైక్ మంజుల ముందుంచారు.

"చెప్పమ్మా భయంలేదు!" అన్నారు.

"నాకు గుడ్ హేబిట్స్ ఏమీలేవండీ! అన్నీ బ్యాడ్ హేబిట్సే! ఉదయాన్నే తొందరగా నిద్రలేవను. బ్రష్ చేసుకునేందుకు అన్నీ మమ్మీ అందివ్వాలి! మమ్మీ నాకు స్నానం చేయించాలి. డ్రస్ వెయ్యాలి, నా స్కూల్ బ్యాగ్ రడీ చెయ్యాలి. నా చేత హోమ్ వర్క్ చేయించి చదివించాలి! మా మమ్మీని రోజూ విసిగిస్తాను. నా వెంటపడి తరిమితేకాని నేను ఏ పనీ చురుకుగా చెయ్యను. నిజం చెప్పాలని మాకు సిటిజన్‌షిప్ క్లాసులో చెప్పారు. అందుకే నేను నిజం చెప్పాను" అన్న మంజుల మాటలకు అందరూ నిర్ఘాంతపోయారు.

**(తెలుగు విద్యార్థి, ఏప్రిల్ 2001)** ✪